అందుకు బావమరిది నప్పుకున్నాడు. ఆ ప్రకారం అతను తన ఇంటిని, కుక్కని తన బావమరిదికి అమ్మేసాడు. ఆ వెయ్యి రూపాయలు తిరుమల హుండీలో వేసి మొక్కు తీర్చుకున్నాడు. మూడు నామాల వాడికి పంగనామం పెట్టిన తన తెలివికి అతను తెగ మురిసిపోయాడు.

మూడో రోజు అతనికి జ్వరం వచ్చింది. ఎన్ని మందులు వాడినా అది తగ్గలేదు. బాగా నీరసించి పోయాడు.

"ఇది ఆఖరి మందు. దీనికీ మీ జ్వరం తగ్గకపోతే ఇక ఆ దేవుడే మీకు దిక్కు." ఓ మందు ఇచ్చి అతని డాక్టర్ చెప్పాడు.

ఆ మందు కూడా అతని జ్వరాన్ని తగ్గించలేకపోయింది. ఇక తనకి చావు తథ్యమని తెలీగానే, మళ్ళీ అతనికి ఏడుకొండలవాడు గుర్తుకు వచ్చాడు.

"స్వామీ! ఈ సారి కూడా మీరే నన్ను కాపాడాలి." ప్రార్థించాడు.

మళ్ళీ అతనికి ఆకాశవాణి వినిపించింది.

"నీ పెంపుడు కుక్కని తెచ్చి నువ్వు నీ మంచానికి మూడు గంటలసేపు కడితే నీ జ్వరం తగ్గుతుంది."

అతను వెంటనే తన బావమరిదికి కబురు పంపి పిలిపించి ఈ సంగతి చెప్పాడు.

"నా పెంపుడు కుక్కని తెచ్చి నా మంచానికి కట్టు."

ఆ బావమరిది సన్నగా నవ్వి చెప్పాడు.

"ఇప్పుడా కుక్క ఖరీదు ఇరవై లక్షలు. ఇష్టం ఉంటే కొని కట్టుకో. లేదా చావు."

## 63. గొప్ప ఉపకారం

ఆ రోజు స్వాతంత్ర్య దినోత్సవం.

అనేకమంది పరోపకారులు ఆ రోజు ఖైదీలకి ఇవ్వడానికి అనేక వస్తువులతో జైలుకి వచ్చారు. ఖైదీలకి పెట్టే అన్నంలో పురుగులు ఉంటాయని

తెలిసి కొందరు మేలిరకం బియ్యంతో అన్నం వండి తెచ్చారు. మరి కొందరు చలిని ఆపే కంబళ్ళు తెచ్చారు. ఇంకొందరు మిఠాయిలని పంచిపెట్టారు. ఇలా చాలామంది తమ శక్తిమేర ఆహార పదార్థాలని, సబ్బులని, ఇతర సౌకర్య వస్తువులని ఆ ఖైదీలకి తెచ్చిచ్చారు.

వారితో పాటు ఓ సన్యాసి కూడా జైలుకి వచ్చాడు. ఒంటిమీది బట్టలు కాక, చేతి సంచీలో ఇంకో జత బట్టలు మాత్రమే గల ఆ సన్యాసి ఖైదీలందరికి 'రామ నామ దీక్ష'ని ఇచ్చాడు.

ఆ రాత్రి ఖైదీలంతా తమకి లభించిన వివిధ కానుకల గురించి మాట్లాడుకోసాగారు. ఎవరు తమకి ఎక్కువ ఉపయోగకరమైంది ఇచ్చారు అన్న విషయం చర్చించుకోసాగారు. కొందరు భోజన ప్రియులు తమకి అందిన రుచికరమైన ఆహారం గొప్పదంటే, ఇంకొందరు తమకి ఇచ్చిన కంబళ్ళు చాలాకాలం ఉపయోగిస్తాయని అన్నారు. మరి కొందరు పాదరక్షలు ఎక్కువ ఉపయోగిస్తాయని చెప్పారు.

ఆ జైల్లోని ఓ గార్డు వీళ్ళ మాటలన్నిటినీ విన్నాడు. ఆధ్యాత్మిక జీవితం గడిపే అతను వాళ్ళతో చెప్పాడు.

"మీకివాళ అందిన అత్యంత విలువైన బహుమానం మీరంతా అనుకుంటున్నట్లుగా భోజనమో, కంబళ్ళో, పాదరక్షలో లేదా ఇతర వస్తువులో కావు. రామ నామ దీక్షే మీకందిన అతి గొప్ప కానుక."

"అదేమిటి? దాని వల్ల మా ఆకలి తీరుతుందా? లేక చలి ఆగుతుందా?" ఆశ్చర్యపోతూ అడిగారు వాళ్ళు.

"ఆకలికి, చలికి రామ నామం రక్షణ ఇవ్వలేకపోవచ్చు. కాని వాళ్ళిచ్చిన ప్రతి వస్తువూ మీరు జైలునించి బయటకి తీసుకెళ్ళచ్చేమో కాని చివరగా మీ వెంట తీసుకు వెళ్ళలేరు. కాని మీరు చేసే ఆ రామ నామ జప ఫలితం మాత్రం మీ వెంట వచ్చి ముందు జన్మల్లో మిమ్మల్ని ఆదుకుంటుంది.

ఒక్క రామ నామం అనే తాళంచెవే ఈ ప్రపంచమనే బంధిఖానా నించి మనల్నందరినీ శాశ్వతంగా బయటపడేసేది. ఎనభై నాలుగు లక్షల రకాల జీవరాశుల్లో తిరిగి తిరిగి జన్మించే కంటే, మళ్ళీ మళ్ళీ పుట్టే దుర్దశ నించి మన ఆత్మని శాశ్వతంగా విడుదల చేసే ఆ తారక మంత్రాన్ని మించిన చక్కటి కానుక మీకు ఇంకోటి ఉండదు." వివరించాడా గార్డు.

## 64. ముగ్గురు వృద్ధులు

ఓ ఇంటావిడకి తన ఇంటి బయటి నించి ఎవరివో మాటలు వినబడ్డాయి.

"ఈ రోజు ఎవరైనా మనకి భోజనం పెడితే బావుండును."

ఆవిడ వెంటనే బయటకి వెళ్ళి చూస్తే చెట్టు కింద, తెల్లటి గడ్డాలు గల ముగ్గురు వృద్ధులు కనిపించారు.

"మీరెవరో నాకు తెలీదు కాని మా ఇంటికి భోజనానికి రండి." ఆహ్వానించింది.

"మీ ఆయన వప్పుకున్నారా?" ప్రశ్నించారు వాళ్ళు.

"ఆయన ఇంట్లో లేరు. ఆఫీసుకి వెళ్ళారు."

"అయితే ఇంటికి వచ్చాక ఆయన అనుమతి తీసుకుని పిలు. మాలో ఎవరో ఒకరే వస్తాం." చెప్పారు.

భర్త ఆఫీసునించి ఇంటికి వచ్చాక ఆవిడ ఆ వృద్ధుల గురించి ఆయనకి చెప్పింది.

"అలాగా! నేను అనుమతి ఎందుకు ఇవ్వననుకున్నారు? వెళ్ళి ఆ ముగ్గుర్నీ భోజనానికి రమ్మన్నానని చెప్పు." ఒప్పుకున్నాడు భర్త.

ఇంటావిడ వంట చేయగానే వెళ్ళి వాళ్ళని భోజనానికి రమ్మని ఆహ్వానించింది.